
# రాతియుగపు భావాలు



కథానిక

సాయంత్రం క్లబ్బులో రాజు నన్ను చూడగానే "ప్రకాశం! మధు పెళ్లిచేసుకుంటాడుట రోయ్" అన్నాడు, అదేదో మహాపరాధమైనట్టు.

"అయితే మంచిదే" అన్నాను ముక్తసరిగా; వాడిధోరణి చూసి అంతకన్న ఎక్కువ మాట్లాడ యిష్టంలేక.

"ఏమిటీ? ఏమన్నావు?" అన్నాడు వింతగా చూస్తూ.

"మంచిదే అంటున్నాను!"

"మవ్వూ అలాగే అంటావేమిట్రా? వాడి విషయం నీకు తెలిసినన్నంత యింకెవ్వరికీ తెలీదు. వాడికి నాలుగేళ్ళకొడుకున్నాడుగదా, ఆ కొత్తావిడ వాణ్ణి బాగా చూస్తుందనేమిటి నమ్మకం? అసలే తల్లి పోయిన వాడి బెంగకి సవతితల్లికూడా తోడయితే వాడు బతికి బట్టకట్టినట్టే! వాడికోసమైనా వాడాబుద్ధి మానుకోవాలి" అన్నాడు ఉపన్యాస ధోరణిలో.

ఆ ముక్క నన్నెందుకో కలతపెట్టింది. ఇంకక్కడ ఉండబుద్ధిపుట్టలేదు. నా మొహంలో రంగుల మార్పు కనిబెట్టిన రాజు తగ్గిపోయి గొణుగుడు మొదలెట్టాడు. మధు నాకు, రాజుకీకూడా స్నేహితుడే. అయితేనేం నాకు మధుకి మధ్య ఉన్నంత చనువు రాజుకీ వాడికీ మధ్య లేదు. కాక రాజు తరహా అంతా అదోలా ఉంటుంది. ఆంతర్యంగా ఆలోచించడానికి ప్రయత్నించడు. బాహ్యంగానే అన్ని విషయాల్ని విమర్శిస్తాడు అందుకే ఈ విషయంలో ఇంత తేలికగా మాట్లాడాడు. మధుకింకా నిండా ముప్ఫయ్యేళ్ళయినా లేవు. ఇంతలోనే నాలుగేళ్ళ కొడుకుని అప్పగించి శకుంతల శెలవుతీసుకుంది. ఆమెని చాలా ఎక్కువగా ప్రేమించేవాడు. చూసినవాళ్లంతా అనుకూల దాంపత్యం అనుకునేవాళ్లు. అయితేనేం విధిరాత. ఆమె పోయింతరవాత చాలా మారిపోయాడు. మళ్ళీపెళ్ళి మాటెత్తితే మండిపడేవాడు. కుర్రాణ్ణి యింటిదగ్గరపెట్టుకుని దాదిని పెట్టి పెంచేవాడు. అత్తగారువాళ్లు పంపమన్నా పంపక, శకుంతల్ని వాడిలో చూసుకుంటూ, పోషణ విషయంలో వాడితో నానా అగచాట్లు పడేవాడు. వాడి ఆరోగ్యంకోసమైనా మళ్ళీపెళ్లి చేసుకోమంటే వినేవాడు కాదు. నాలుగు రోజులనాడు కనబడినప్పుడు మరీమరీ చెప్పాను. ఆలోచిస్తానన్నాడు. రాజు చెప్పినది దాని ఫలితమే కావచ్చు. తరవాత చెప్పుదామని ఊరుకుని ఉంటాడు. ఇంతలోకే రాజుగాడు కూపీ లాగాడు సి. ఐ. డి. లాగ.

ఇంతకీ యీ సంఘంగోడవ అర్థంకాదు. వాడు మానవసహజమైన కోర్కెల్ని తీర్చుకునేందుకు నైతికపతనం చెందితే మళ్ళీ ఈ రాజుగాడే అంటాడు మధు చెడిపోయాడని.

సంఘం అంటే యిలాంటి విషయాల్లో వళ్ళు మండుతుంది నాకు. మధుగాడు యింకా మళ్ళీ పెళ్ళి చేసుకోనేలేదు. ఆ రాబోయే ఆవిడ మంచి చెడ్డలు యింకా ఎవరికీ తెలియవు. ముందుగానే ఆవిడనిగురించిన వీళ్ళ దురభిప్రాయాలు నాడండి.

ధనిష్ట

ఆవిడ మధు కొడుకుని (బాబిగాణ్ణి) కన్నకడుపు కంటె ఎక్కువగా చూసుకుంటుందేమో ఎవరు చూశాడు? సంఘం దృష్టిలో సవతితల్లులు నర రూప రాక్షసులు, సవతిబిడ్డల్ని నానా యాతనలు పెట్టేవాళ్లు ఈ భావానికి తరతరాలుగా మార్పులేదు. అనాదినుండి యిలాంటి కథలెన్నో ఉన్నాయి. పూర్వాపరాలాలోచించకుండా వాళ్ళనెత్తిన అభాండాలువేస్తారు. మంచిచెడ్డల్ని విమర్శించడంకన్న, చెడ్డనాధారంచేసుకుని ముందే చేసుకున్న నిర్ణయాలని సమన్వయించుకోడానికే ఎక్కువ ప్రాధాన్యం యిస్తారు. అంతేకాదు వాళ్లు మంచిగా ఉండడం వాళ్ల కిష్టం ఉండదు, తమ కొలతలకి అది సరిపోదుగనక.

ఇలాగే ఆలోచించుకుంటూ యిల్లు చేరాను. కోటువిప్పి స్టాండుకి తగిల్చి కుర్చీలోకూర్చుని సిగరెట్టు ముట్టించాను. టేబుల్ మీదఉన్న పేపరు తీశాను. కళ్లైతే పేపరుమీద ఉన్నాయిగాని బుద్ధి యిందాకటి విషయమే ఆలోచిస్తోంది. మా శ్రీమతి, మాంచి కాఫీతీసుకువచ్చి బల్లమీద పెట్టినట్టు, ఆమె పేపరుతీసి అవతల గిరవాటేసి నా వీపుతట్టేవరకు తెలీనేలేదు. ఉలిక్కిపడి ఊహా ప్రపంచంవదిలి వస్తుప్రపంచంలోకి అడుగెట్టాను. ఏం జరిగిందో తెలీక ఆమెవేపో నిరర్థకమైనచూపు చూశాను.

"ఏమిటో అంత దీర్ఘాలోచన?" అంది నవ్వుతూ.

"అబ్బే ఏంలేదు" అన్నాను, పరధ్యానంగానే.

"సరేపోనీ చెప్పలేకపోతే యిబ్బందిలేదుగాని కాఫీతాగండి, చల్లారిపోతుంది. మళ్ళీ వెచ్చబెట్టడానికైనా కుంపటి ఆర్పేశాను."

కాఫీ తాగుతూంటే మళ్ళీ మొదలెట్టింది

"ఏమిటంత దీర్ఘంగా ఆలోచిస్తున్నారు?"

"ఏంలేదు" అన్నాను ఏమి చెప్పడానికీ మనస్కరించక.

"నాతోగూడ చెప్పకూడదా? ఏమిటో అంత రహస్యం?"

"రహస్యమేమీలేదు. ఇందాక రాజు 'మధు పెళ్లిచేసుకుంటాడుట' అని మహాశ్చర్యంగా చెప్పాడు,—"

"నిజమే?" అంది తనూ మహాశ్చర్యంగా, నన్ను మాట మధ్యలోనేలోనే తుంచుతూ.

"ఏం అంత ఆశ్చర్యం! మీకందరికీ వాడేదో మహాపరాధం చేస్తూన్నట్టుందే?"

"బాబిగాణ్ణి చూసైనా మానుకోవద్దటండీ" అంది అయిష్టంగా మొహంపెట్టి. నేనూ, మధూ స్నేహితులమయినట్టే శకుంతలకీ మాలతికీ ప్రాణ స్నేహం; ఆమెపోయినప్పుడు పుట్టిమొదట వాళ్ల ఇంట్లో అదుకున్నది మేమే. అప్పుడు మాలతి సొంత చెల్లెలు పోయినట్టు ఏడ్చింది రెండురోజులపాటు. ఆ నాలుగు రోజులూ బాబిగాడికి అన్నీ మాలతే చూసేది. మాలతి నిప్పటికీ వాడు "పిన్నీ" అనే పిలుస్తాడు. అంచేత మధు మళ్ళీ పెళ్లాడుతున్నాడంటే పోయిన శకుంతలకు, ఉన్న బాబిగాడికి అన్యాయం జరిగినట్టు ఫీలయింది. కాని నాకు మనస్సు చివుక్కుమంది తనూ అట్లాగే అనుకుంటే ఎలా? మనస్సులోని భావం బయటకు కప్పిపుచ్చి,

"ఆ వచ్చే ఆవిడ మంచి చెడ్డల్ని గురించి ఏమీ తెలియకుండా ఎందుకలా మాట్లాడుతావు" అన్నాను.

"మీరూ అలా అంటారేమిటండీ? సవిత్తల్లి సవితల్లే కన్నతల్లి కన్నతల్లే. ఇద్దరికీ నక్కకి నాగలోకానికి ఉన్నంత తేడావుంది. ఈ లోకంలోఎంతమందిని చూడటంలేదు సవితిపిల్లల్ని రాసి రంపాన పెట్టేవాళ్ళని."

ఈ మాట వినగానే మాలతిమీద కోపం జాలి గూడ వచ్చాయి. అప్పటికీ నిలవదొక్కుకుని

"ఆమాత్రం వాడూ ఆలోచించే చేసుకుంటాడు. వాడికి బాబిగాడంటే ప్రాణం. నిజానికి వాడికోసమే చేసుకుంటున్నాడు" అన్నాను.

"ఏమైనా మొదట్లో బాగానే చూసినా పిల్లలు పుట్టాకైనా మనస్సు మారిపోతుంది" అంది లోకాన్నంతా కాచి వడబోసినట్టు.

నాకింక మాట్లాడ బుద్ధికాలేదు. అందరితో పాటు, శారద విషయం తెలిసున్న తనూ, సంకుచిత దృష్టితోనే చూస్తుందేం? విశాల హృదయానికి యీ సంఘంలో తావేలేదా? అంతలో ఆరేళ్ళ క్రితం జరిగిన సంఘటనలు సినీమా రీలులాగ నా బుద్ధిలో తిరిగాయి. నా మొహంలో మార్పు కని పెట్టిన శ్రీమతి భయంభయంగా మొహంపెట్టి!

"ఏమండీ! మాట్లాడరేం? ఏదో పొరపాటున అన్నాను అందరిలాగే. మీరింత పట్టించుకుంటారనుకోలేదు. శకుంతలా బాబిగాడు తలపు వచ్చి అలా అన్నాను" అంది.

"అబ్బే నీదేం తప్పులేదు. నువ్వూ యీ సంఘంలో మనిషివేగా. పూర్వాపరాలాలోచించకుండా మాట్లాడడం లోకానికిపరిపాటి - నువ్వూ అంతే చేశావు. కాని శారద విషయం తెలిసివున్న నువ్వు కూడా అందరిలాగే మాట్లాడ్డం మాత్రం నాకెందుకో కష్టమనిపించింది" అన్నాను.

శారద పేరు వినగానే మాలతి ఏడుపుమొహం పెట్టింది. "పాపం... శారద"... అని కళ్ళమ్మట నీళ్లెట్టుకుంది.

* * *

ఆరేళ్ళ క్రితం మెడ్రాసునించి ఉద్యోగరీత్యా విశాఖపట్నం వెళ్ళాను మాలతితోసహా. మొదట సత్రంలో దిగాం. ఇల్లు దొరకడం మహాయిబ్బందైంది. ఆఫీసు పనివల్ల పగలు మాలతి, రాత్రి నేనూ తిరిగేవాళ్ళం కొంపకోసం. నచ్చిన కొంప దొరకడం మహా బ్రహ్మాండమైంది. ఒక హంగువుంటే ఇంకోటి ఉండేదికాదు. నాకు నచ్చితే మాలతికి నచ్చేదికాదు. ఇద్దరికి నచ్చితే అద్దె తలకుమించి ఉండేది. మూడో రోజు ఆదివారం ఇద్దరం బయలుదేరాం. తిరిగితిరిగి నిరాశ చేసుకుని మరలిపోదాం అనుకుంటూంటే ఇంకో యిల్లు పెద్దది కనబడింది. పోనీ ఒక్కటేగదా వాటా ఏమైనా దొరుకుతుందేమో చూద్దామంది మాలతి. ఆశ ఏమీ లేకుండానే వెళ్ళి అడిగాం యధాలాపంగా. అదృష్టంకొద్దీ ఆవిడ ఉందంది. ఇల్లు చూసుకున్నాం. అద్దెతోసహా అన్నీ నచ్చాయి. ఆ యిల్లంతా వాళ్లొక్కళ్ళే తీసుకున్నారుట. కలిసేవాళ్లెవళ్లైనా వస్తే కొంత వాటా యియ్యవచ్చునని. మాకిస్తామన్నారు. కొండెక్కినంత పనైంది. వేయి దండాలతో వాళ్ళని బహూకరించి వెంటనే వచ్చేశున్నాం. మరునాడు సామానంతా తీసుకొచ్చి గృహప్రవేశం చేశాం.

రామారావుగారు సింధియాలో ఏదో ఆఫీసరు. మంచియిల్లు కనబడగానే తగినంతమంది లేకపోయినా, అంతా వాళ్ళకక్కర్లేకపోయినా, ఎవరైనా వస్తే యిద్దామని తీసుకున్నారట. వాళ్లు వచ్చిగూడ నెలేఅయిందిట. శారద చాలా కలుపుగోరు మనిషి. ఇద్దరుపిల్లలు శాంతా, బాబ్జీ. ముద్దొచ్చేటట్టు ఉండేవారు. శారదా రామారావు యీడుజోడుగా ఉండేవారు. మా మాలతీ ఆమే రెండురోజుల్లోనే ఫ్రెండ్సయిపోయారు. నాలుగు రోజుల్లోనే నాలుగేళ్ళనించి తెలిసి ఉన్నంత పరిచయమైంది అంతా ఒకటే తత్వం వాళ్ళకవడంచేత. శారదకు నేను అన్న నవడం మాలతికి రామారావు అన్నవడం సహ్యంగానే జరిగాయి. పండుగరోజుల్లో అంతా ఒకయింట్లోనే భోజనాలు. మొత్తానికి అంత సన్నిహితంగా ఉంటూన్నా కొంతకాలంవరకు శారద రామారావుకి రెండో పెళ్ళి పెళ్ళామనిగాని, బాబ్జీ శారద సవితికొడుకనిగాని మాకు తెలీలేదు. వాడి కప్పటికి నాలుగేళ్లుండేవి. శాంతకు రెండు. బాబ్జీ పుట్టిన ఆరునెల్లకే వాడితల్లిపోతే ఒక ఏడాదిపాటు నానా అవస్థలుపడి తనేపెంచి చివరికి యింక వీలులేక శారదను పెళ్ళి చేసుకునిభారం దింపుకొన్నాడు రామారావు.

ఈ విషయం అంతా పక్కవాళ్ళకు తెలియడం బాబ్జీ అమ్మమ్మ సుందరమ్మ వచ్చినప్పుడే. అంతవరకు ఈ విషయం వాళ్ళకు తెలీనే తెలీదు. ఆవిడ మొట్టమొదటే అంటే బాబ్జీతల్లి పోయినప్పుడేవచ్చి కుర్రాణ్ణి తీసికెడదామన్నా అతను (రామారావు) వప్పుకోలేదు. అంచేత అప్పుడప్పుడు వచ్చి చూసిపోతూంటుంది. రామారావు శారదను పెళ్ళిచేసుకోవడం ఆవిడకు సుతరాం యిష్టంలేదు. నలుగురిచేతా చెప్పించింది. కాని రామారావుకి కొడుకంటే ప్రాణం; వాడికోసమే శారదను చేసుకున్నాడు. ఆమెని అదివరకే అతనికి తెలుసు. అనుకూలవతి అని ఎంచుకునే చేసుకున్నాడు.

సుందరమ్మ వస్తూనే మహా ఆప్యాయంగా మనవణ్ణెత్తుకుని బావురుమంది,

"అయ్యో! ఎంతచిక్కిపోయావురానాయనా? మీ అమ్మే ఉంటే... అయ్యో కూతురో..." అని ఏడుపు లంకించుకుంది. వాడికిదేమీ అర్థంకాక శారదదగ్గరకు పరిగెత్తాడు ఏడుస్తూ. ఇది చూసిన ఆవిడకి కడుపులో దేవినట్లయింది.

సాయంకాలం మా వాటాకొచ్చి మమ్మల్ని పలకరించి "కుర్రాడెల్లా అయిపోతున్నాడో?"

అని వాపోయింది శారదఅంటే ఆమెకిష్టంలేక పోవడమే కాకుండా శారదయందెవరికీ సానుభూతి ఉండడం ఆమె సహించలేదు.

“అబ్బే బాగానే ఉన్నాడండీ! శారదకి వాడంటే పంచప్రాణాలు. వాడికీ అంతే” అంది మాలతి.

“అయ్యో ఎక్కడమ్మా? వాళ్ళమ్మ ఉంటే... ఎల్లా ఉండవలసినవాడు...ఇల్లా ఉన్నాడుగాని సరిగ్గాపోషణలేక... దిక్కూ దివాణమూ . ఎవరమ్మా వాడికి? అతగాడేమో నాదగ్గరకి పంపమన్నా పంపడు. మధ్యన పిల్లాడు నలిగిపోతున్నాడు.” అని కళ్ళు తుడుచుకుంది.

ఎన్నో చెప్పి శారదపట్ల మాలతి మనస్సు విరవడానికి ప్రయత్నించింది, శాంతనుచూస్తే కళ్ళల్లో నిప్పులుపోసుకునేది. నాలుగురోజులుండి వెళ్ళిపోయింది ఇదివరకు వాళ్ళున్న చోటాకూడా యింతే చేసేదిట.

ఆమెవెళ్ళిన తరువాత బాబ్జీని వళ్ళో పెట్టుకుని మాలతిదగ్గర కుమిలికుమిలి ఏడ్చింది శారద. తను వాణ్ణెంత ప్రేమిస్తూన్నా, వాడు తనంటే ఎంత ప్రేమగా ఉన్నా, మధ్యవాళ్లు కల్పించుకుని అనవసరంగా తనకడుపులో చిచ్చెందుకు పెడతారో అర్థంకాక ఏడ్చేది. బాబ్జి శారదనే “అమ్మా” అని పిలిచేవాడు. వాడికి శారద సవతితల్లని గాని, తనకో సొంతతల్లి ఉండేదని కాని తనతల్లే ఉంటే ఎల్లాఉండేదో గాని తెలియడానికి అవకాశమే ఉండేదికాదు.

నేనూ, మాలతీ, శారదను పూర్తిగా అర్థం చేసుకున్నాం. రామారావు సరేసరి. అతనికి శారదంటే మహా ప్రేమతోగూడిన గౌరవం. ఆమె బాబ్జీపట్ల కనపరిచే నిష్కాపట్యప్రేమకు,ముగ్ధుడై ఆమె విశాలహృదయానికి జోహార్లర్పించేవాడు. అందుకే శారదయందు అంత గౌరవం. ఆమెను యితరులేదైనా (ముఖ్యంగా సుందరమ్మ) అంటే బుజ్జగించేవాడు. “నువ్వు నిష్కారణంగా ఎందుకు విచారిస్తావు. నీ విషయం నాకు పూర్తిగా తెలుసునని నీకు తెలుసు. బాబ్జీగాడికి నీకంటె వేరే తల్లి ఉందని తెలియనే తెలియదు. తెలిసే అవకాశం కూడా లేదు. వాడు నువ్వే అమ్మవనుకుంటున్నాడు. శాంతే చెల్లెలనుకుంటున్నాడు. ఒక తల్లి బిడ్డలకంటె ఎక్కువ అన్యోన్యంగా ఉంటున్నారు. లోకులకోసం నువ్వుకూడ ఎందుకు భయపడాలి?” అని.

మారు రోజు యీ విషయం కళ్ళకి కట్టేది. కన్నబిడ్డల్ని సైతం అంతగా ప్రేమించే తల్లులుండకపోవచ్చు. ఏ విషయంలోనైనా ఆమె ప్రేమలో మొగ్గు బాబ్జీవైపుకే ఉండేది. శాంతకంటె వాణ్ణే ఎక్కువగా చూసేది. వాడికేలోటూ రానిచ్చేది కాదు. ఇది రామారావుని మమ్మల్ని కూడ యింకా ఆశ్చర్యపరిచేది వాడు జిర్రున చీదినా అదిరిపడేది.

రోజులు ఎల్లకాలం ఒక్కలాగ గడవ్వు. మంచి వాళ్ళకే కష్టాలు బాబ్జీకి జ్వరం వచ్చింది. శారద మహాబెంగపడి పోయింది. డాక్టర్ని పిలిచింది. మందిచ్చాడు. రెండురోజుల్లో తగ్గిపోతుం దనుకున్నది. తగ్గకపోయేసరికి యింకా బాధ పడిపోయింది. డాక్టరు వచ్చేవాడు యింజక్షన్ యిచ్చేవాడు. తనకే ఆ యింజక్షన్ యిచ్చినట్టు బాధ పడేది. రాత్రింబగళ్ళు వాడి మంచమే పట్టుకుని వేళ్ళాడేది. శాంతని చూసేదికాదు. మాలతి వెళ్ళి వాళ్ళింట్లో వంటా అదీ చేసేది. ఎంతో బతిమాలితే అప్ప ఎంగిలి పడేదికాదు. రెండు మెతుకులు కతికేలోపలే వాడు అమ్మాఅని పిలుస్తే విస్తరివదిలి వెళ్ళిపోయేది. ఆ జబ్బు తనకైనా వచ్చింది కాదని ఏడ్చేది. రెండోవారం టైఫాయిడ్ అని తేలింది. టైఫాయిడ్ అనగానే శారద మరీ నీరైపోయింది. సంధికూడా ప్రారంభమైంది. “అమ్మా బూచీ” అని కలవరించి ప్రక్కమీదనించి లేచిపోయేవాడు “లేదు నాన్నా” అని బుజ్జగించి ఆ జ్వరంలో వాడిపక్కనే పడుకుని ఓదార్చి మహా విచారించేది. ఎంతో డబ్బు ఖర్చుపెట్టారు. కోరినమందల్లా తెచ్చారు ఎవరో చెపితే మొక్కులు, పూజలు, దీపారాధనలు అన్నీ చేయించారు పిచ్చిగా. కాని శారద ప్రేమా, శ్రమా, అంతా వృధా అయిపోయింది. మమ్మల్నందర్నీ విడిచి, శోకంలో ముంచెత్తి వెళ్ళిపోయాడు. శారద విషయం యింక చెప్పనేలేము. రెండువారాలనించి నిద్రాహారాలు లేకపోవడమే కాకుండా యీ దెబ్బలో మరీ తట్టుకో లేకపోయింది.

బాబ్జీపోయిన రెండు రోజులకే సుందరమ్మ తయారైంది. వస్తూనే "నేననుకుంటూనే వున్నాను వాడింతేనని" "నా కుత్తరమైనా రాయలేదని" భోరుమంటూ ఊరంతా చాటింది. అంత ప్రేమా తనదే అయినట్టు "సవతి తల్లి చేతుల్లో అంతే అనుకున్నాను" అని మొత్తుకుంది. ఆవిడ ముందే వస్తే రగడ పెరుగుతుందనే భయంవల్లా పరిస్థితుల ఆందోళనవల్లా రామారావు ఆమెకు ఉత్తరం రాయలేదు. నలుగురు ఎన్నిమాటల పూర్వాపరా లాలోచించకుండా "ఉత్తరం ముక్క రాశారు కాదుటేం ముసలి ఆవిడకు?" అని పరామర్శించే వారు. అసలు బాధకుతోడు లోకుల సూటీ పోటీమాటలు శారద హృదయాన్ని మరింత కలవర పెట్టాయి.

లోకం ఆమెను సవతి తల్లికిందే చూస్తుంది కాని అంతర్యం గ్రహించడానికి ప్రయత్నించ దేం? ఆమె బాబ్జీని మనస్ఫూర్తిగా ప్రేమించేది. వాడి కన్నతల్లి ఉన్నా అంతకన్న ఎక్కువగా చూసేది కాదేమో! తనకిగూడ ఒక కూతురున్నా, శాంతకంటె వాణ్ణే ఎక్కువ చూసేది. లోకానికి వెరచి కాకుండా మనస్ఫూర్తిగానే చేసేది ఏపని చేసినా. ఆ సంగతి మాకే ఎక్కువ తెలుసునంటే తప్పులేదేమో? అసలే శోకంలో ఉన్న ఆమె సుకుమారహృదయానికి లోకులనిందలు అగ్నికి ఆజ్యం వలె అయ్యాయి. నాలుగురోజులపాటు అన్నపానాదులు ముట్టిందికాదు. రామారావు ఆమెను అర్థం చేసుకున్నవాడవడంచేత అంత దుఃఖంలోను ఆమెను బుజ్జగించ ప్రయత్నించేవాడు లోకానికి భయపడవద్దని. ఆమె బాధ తగ్గేదికాదు. నేనూ మాలతీ ఎంత బతిమాలినా ప్రయోజనం లేక పోయేది. వాణ్ణి తల్చుకుని వాపోయేది.

కొంతకాలానికి ఏదో యింటిపనులు చేసుకునే పాటి తేరుకున్నా మనసిచ్చి మాట్లాడేదికాదు. ఆ శారదేనా అనిపించేది. పూర్వపు రోజులు తల్చుకుంటే, ఏదో ఎప్పుడూ యింకో లోకంలో ఉంటూనట్టు విచారసముద్రంలో తేలుతూండేది. మనిషి నీరసించిపోయింది. రామారావు డాక్టర్ని పిలిపించి చూపించాడు రోగం ఏమీ తేలలేదు. మనోవ్యాధికి మందేమిటి? ఎందరెంత చెప్పినా ప్రయోజనం శూన్యం. శాంత విషయమే పట్టించుకునేది కాదు. ప్రతిదానికీ విసుక్కునేది. అంత శాంతమూర్తి యిల్లా ఎలా అయిందా అనిపించేది. కారణం తల్చుకుంటే కళ్ళంట నీళ్ళు వచ్చేవి. మాలతి ఎంత ప్రాసుకు తిరిగినా అంటీ ముట్ట- ముట్టట్టుండేది

ఇలా మరో ఆరునెలలు గడిచేటప్పటికి మనిషి పూర్తిగా నీరసించిపోయింది. గుండె నీరసం పట్టుకుని యింటిపనులు చక్కబెట్టుకోలేనంతగా నీరసించిపోయింది. డాక్టర్లు యింజక్షన్లు యిచ్చే వారు బలానికి పాలు, పళ్ళు, టానిక్కులు, తినమనే వారు. డబ్బుకి ఆలోచించకుండా రామారావు అన్నీ పట్టుకొచ్చి తనే బలవంతాన త్రాగించేవాడు. అతను గూడా ఎంతో బాధపడేవాడు. సాధ్యమయినంతవరకు ఆమెకు ధైర్యంచెప్పేవాడు. లాభంలేకపోయేది. డాక్టర్లని మార్చేవాడు. వాళ్ళుమాత్రం మందు లివ్వగలరుగాని మనస్సునేం చెయ్యగలరు? మనస్సు నిలవదొక్కుకుంటేనేగాని ప్రయోజనం లేదనే వారు. ఈ కథ విన్నవాళ్లు గూడ ఆశ్చర్యపోయే వారు. అస్తమానూ బాబ్జీని తల్చుకుని ఏడ్చేది. మాలతితో మాట్లాడే నాలుగు మాటల్లోను వాణ్ణి గురించినవే మూడుండేవి.

ఈ విధంగా యింకో రెండు నెలలు గడిచేటప్పటికి మంచమెక్కింది. హాస్పిటల్లో ప్రవేశ పెట్టారు. కాని ప్రయోజనంలేకపోయింది శాంతను మళ్లీ తల్లిలేనిదాన్నిగా రామారావుకి అప్పగించి, బాబ్జీనీ శాంతనీ తల్చుకుంటూ చనిపోయింది రెండు రోజులపాటు ఏడ్చాం. అంతకన్న ఏం చెయ్యగలం? శాంత ఏమీ తెలియకుండానే మమ్మల్ని చూసి ఏడుస్తూండేను. "అమ్మా" అని పిలిచినప్పుడు కడుపు తరుక్కుపోయేది. రామారావు ఉద్యోగం వదిలేసి శాంతని తీసుకుని వెళ్ళిపోయాడు. మొదట్లో కొంతకాలం ఉత్తరాలువచ్చేవి. తరువాత అవీ లేవు. మేముకూడా ఇంక ఆ వూళ్లో ఉండలేక ఇక్కడికి ట్రాన్సఫర్ చేయించుకున్నాం. ఇంతకాలమయాక శాంత రామారావు ఎక్కడున్నారో తెలియకపోయినా శారద విషయం గుర్తొచ్చినప్పుడల్లా రెండు రోజులపాటు మనస్సు మనస్సులో ఉండదు.

ఈ కథ యిలా విషాదాంతం కావడం మీకిష్టం కాకపోవచ్చు కాని వాస్తవంగా జరిగింది మరి! ఎవరైనా చెపితే నమ్మలేనట్టుగా ఉంటుందీవిషయం. కాని లోకంలో అలాంటివారున్నారని కంటితో చూసిన మేము నమ్మకతప్పదు. ఎవరైనా యీ కథే యథాతథంగా మాకు చెప్తే మేమే నమ్మలేకపోయేవాళ్ళమేమో అంటే ఆశ్చర్యంలేదు. ఆమె సున్నితహృదయం, బాబ్జీ మరణం, లోకనిందలవల్ల కల్గిన తాపానికి తట్టుకోలేకపోయింది. సంఘానికి సవతి తల్లులమీద ఇంత నిర్దాక్షిణ్యం ఎందుకో? అనవసరంగా సుందరమ్మలాంటి వ్యక్తులు శారదలాంటి వారిని బాధపెట్టి బావుకునేదేమిటో? ఈ విషయం తల్చుకున్నకొద్దీ సంఘాన్ని క్షమించలేనంత కోపం, బాధ కలుగుతాయి నాకు. కాని నేనుగూడ ఈ సమాజపు నాలుగు గోడలమధ్య వాడినేనని తల్చుకోగానే సిగ్గువేస్తుంది.

ఇది జ్ఞాపకం చేసుకున్నంతసేపూ నేనూమాలతీ ఏడుస్తూనే ఉన్నాము. తనంత తేలికగా మధు విషయంలో ప్రవర్తించినందుకు తనని తానే తిట్టుకుంది మాలతి.

మర్నాడు మధు ఇంటికి ఇద్దరం వెళ్ళి వాణ్ణి తగిన అమ్మాయినిచూసి పెళ్ళిచేసుకోమని మరీమరీ వత్తిడి చేసాం. ఈ మాటు బాబిగాణ్ణి ఎత్తుకున్న మాలతి వాణ్ణోడిపించి, తనేడవకుండా వాడికి అమ్మ మళ్ళీ వస్తుందని మరిపించి సంతోషపెట్టడానికి ప్రయత్నించింది.

---

కథానిక

# అన్వేషణ

"గోపీ"

"పోస్టుమేన్! మాకేం ఉత్తరాల్లేవూ?"

"లేవు నా చిట్టితల్లీ!"

"మరందరికీ ఇస్తావ్!"

"వాళ్ళకెవరో వ్రాశారు."

"అబద్ధమాడుతున్నావ్! మా నాన్న రాయలేదూ నిజం చెప్పూ."

ఇది రెండోసారి, ఆ చిన్నమ్మాయి పోస్టుమేన్ని నిలదీసి అలా ప్రశ్నలువేయడం. ఆ కేళ్లంటాయి. గులాబీ రెక్కల్లా బుగ్గలు, రీవి, ఎంతో ముద్దొస్తూంది ... పోస్టుమేన్ని అడిగాను "ఆ యింట్లో ఉన్నదెవరో?" అని.

"ఎవరో బాబూ! ఆ చిన్నమ్మకి లేదని చెప్పలేక నాకెంతో కష్టంగా ఉంది. మిమ్మల్ని అడుగుదామనుకుంటూ ఇలా వచ్చే" నన్నాడు, పజిల్డు ఫేస్ (puzzled face)తో.

ఆ పిల్లని చూచాక తల్లి ఎలా ఉంటుందో అన్న ప్రశ్న? ఎవరు? ఎందుకంత గోప్యంగా బ్రతుకుతున్నారు? బహుశ చుట్టుపక్కలవారిని వాకబుచేస్తే తెలియొచ్చు, అని అనుకున్నాను. కాని ఎప్పుడూ మూసే ఉన్న తలుపు వెనకాల తరుణి నా కుతూహలాన్ని పూర్తిగా రెచ్చగొట్టింది...బహుశ నే నుండే పరిసరాలుగురించి చెబితే మీకు కూడా నాఅంత కుతూహలం పుడుతుందేమో. ఒకపక్క గొల్లపేట. రెండోపక్క ఏతగూడెం, సన్నని బాట. కొంచం దూరంలో కోనేరు అక్కడవట్టుకు కలకలలాడుతూ జనసంచలనం ఉంటుంది. నేనున్న ఇల్లూ, ఎదురుగుండా ఉన్నదీ పెంకుటిల్లు తక్కినవి తాటికమ్మ, పురితో నేయబడినాయి. మా స్నేహితులు రెండేళ్ళూ, ఈ పరిసరాల్లో గడప దల్చినందుకు నాకు 'వీరచక్రం' ఇవ్వొచ్చంటారు. కాని తలుచుకుంటే ఎక్కడన్నా గడపవచ్చు. ముందిల్లు ఎప్పుడూ ఖాళీయే. కాని వారం క్రిందట అనుమానం వేసింది, ఎవరో నివసిస్తున్నట్లు. చిన్నమ్మాయిని ఒకటి రెండుసార్లు చూశాను. కాని అంతగా ఆలోచించలేదు నాలుగు రోజులు సెలవలుకూడా